క్లుప్తంగా

పెట్రోల్ బంకుల్లో తనిఖీ



వెల్దుర్తి పెట్రోల్ బంకు కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు

వెల్దుర్తి: స్థానిక కొత్త బస్టాండు వద్ద గల హెచ్‌పీ కార్పొరేషన్, రామళ్లకోట రోడ్డులోగల ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోల్ బంక్‌లలో శుక్రవారం తూనికలు, కొలతల విభాగం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులు, పెట్రోల్, డీజిల్ స్టాక్, వాటి నాణ్యత, పరిమాణం, తూకాలు శాస్త్రీయంగా సరిగా ఉన్నదీ లేనిది పరిశీలించారు. తనిఖీలు నిర్వహించిన ఫ్లయింగ్ స్క్వాడ్ అసిస్టెంట్ కంట్రోలర్ ఈశ్వరరావు, అన్నమయ్య జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు మాట్లాడుతూ రెండు బంకుల నిర్వహణ నిబంధనల మేరకు ఉన్నాయన్నారు. తనిఖీల వివరాలు ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు.

10న మున్సిపల్ సమావేశం

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక మున్సిపల్ సమావేశ భవనంలో ఈనెల 10వ తేదీన మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నట్లు చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు శుక్రవారం తెలిపారు. కౌన్సిల్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

దరఖాస్తుల స్వీకరణ

నందవరం: మండలంలోని ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి తెలిపారు. ఆమె శుక్రవారం మాట్లాడుతూ నందవరం మండలంలో 5 ఆయా పోస్టులు ముగతిలోని అంగన్‌వాడీ కేంద్రం-3 ఎస్టీ, నాగలదిన్నె- 1 బీసీ-డీ, టి.సోమలగూడూరు-2లో ఓసీ, హాలహర్వి-2 ఎస్టీ, ఇబ్రహీంపురం-2లో ఈడబ్ల్యూఎస్ రిజ్వరేషన్ల ప్రకారం ఖాళీలు ఉన్నాయని వివరించారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ సాయంత్రంలోపు దరఖాస్తులను ఎమ్మిగనూరు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయంలో అందించాలన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

గోనెగండ్ల: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అని ఎంపీహెచ్‌ఈఓ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ హనుమంతు అన్నారు. శుక్రవారం గోనెగండ్లలో ఏఎన్‌ఎం లక్ష్మీనరసమ్మ, ఆశా వర్కర్లతో కలిసి ఎస్సీ కాలనీ, దొనబండ, ఉప్పరవీధి తదితర వీధుల్లో పర్యటించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉన్న చోట, నీళ్ల సంపులలో ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

భూసర్వే పకడ్బందీగా చేపట్టండి

నందవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న భూ హక్కు- భూ రక్ష పథకంలో భాగంగా గ్రామ కంఠం భూముల సర్వే పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి ఆదేశించారు. భూముల రీసర్వేపై పంచాయతీ రాజ్ కమిషనర్ కోన శశిధర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ..ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో నిర్వహించే భూముల రీసర్వేలో గ్రామ కంఠం భూములను గుర్తించాలన్నారు. సర్వే పకడ్బందీగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఈఓఆర్డీ ఈశ్వరయ్య, పంచాయతీ కార్యదర్శులు జయరాం, రంగనాయకులు, నౌసన్న, శ్రీధర్‌గౌడ్, ఆనందరావు, జ్యోతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ఆలూరు:దేవనకొండ మండలంలోని కప్పట్రాళ్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో వెలసిన కొలుట్ల చెన్నకేశవ స్వామి ఆలయ హుండీ కానుకలను శుక్రవారం దేవదాయ శాఖ ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ చైర్మన్ హనుమంత రెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.1,82,411 లభించినట్లు ఈఓ తెలిపారు. దేవదాయ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది శ్రీనివాసులు, సురేష్, గ్రామస్తులు రంగడు, లక్ష్మణ స్వామి, వెంకటేష్, దస్తగిరి, కొలుట్ల ఉన్నారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

చిప్పగిరి: ఈ క్రాప్ నమోదు వంద శాతం పూర్తి చేయాలని ఏఓ ఆనంద్ ఆర్బీకే సిబ్బందికి సూచించారు. శుక్రవారం స్థానిక ఆర్బీకేలో గ్రామస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రబీలో సాగు చేసిన శనగ, పొద్దుతిరుగుడు, జొన్న తదితర పంటలను తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని రైతులకు సుచించారు. పీఎం కిసాన్ లబ్ధిదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ చేసుకోవాలన్నారు. ఎంపీఈఓ రంగస్వామి, రైతులు పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత

హొళగుంద:మండల పరిధిలోని గజ్జహళ్లి గ్రామంలో ఇటీవలే చాకలి మస్తానయ్య అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. అతని భార్య హనుమంతమ్మకు వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష మంజూరు కాగా అందులో తక్షణ సాయం రూ.10 వేలు నగదును శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి అశోక్, రాము, వడ్డె హనుమంతు చేతుల మీదుగా బాధితురాలికి అందజేశారు. మిగతా మొత్తం త్వరలోనే బాధితురాలి బ్యాంకు ఖాతాలో జమ అవుతాయన్నారు.

మాట నిలబెట్టుకున్న సీఎం జగన్



ఎమ్మిగనూరులో కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరురూరల్: పాదయాత్రలో ఇచ్చిన హామీలను పక్కాగా అమలుచేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరోనా వల్ల రాష్ట్రం ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పథకాలు అమలుచేస్తూ తండ్రిని మించిన తనయుడు అనిపించుకుంటున్నాడన్నారు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్లు పొందాలంటే జన్మభూమి కమిటీల సిఫార్సు కావాల్సి వచ్చేదని ప్రస్తుతం అర్హులైన వారికి ప్రతినెలా 1వ తేదీనే పింఛన్లు ఇంటివద్దకే తెచ్చిస్తున్నారని గుర్తుచేశారు.. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షే మ పథకాలు నేరుగా ప్రజల వద్దకే చేరుతున్నాయని చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, మండలాధ్యక్షుడు గొల్ల కేశన్న, వైస్ ఎంపీపీ పాలయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, ఎంపీడీఓ బంగారమ్మ, నాయకులు, సచివాలయ ఉద్యోగులు, పింఛన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులకు అండగా ఉంటాం

ఎమ్మిగనూరుటౌన్/ఎమ్మిగనూరురూరల్: మండల పరిషత్ దుకాణాల నిర్మాణ సముదాయానికి శుక్రవారం ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ సముదాయంలో 5 నూతన దుకాణాలు మంజూరయ్యాయని చెప్పారు. భూమి పూజలో కో-ఆపరేటీవ్ స్టోర్ చైర్మన్ షబ్బీర్, విరుపాక్షిరెడ్డి, పీఆర్ డీఈ చంద్రశేఖర్, ఏఈ శివశంకర్, టౌన్ సీఐ మధుసుధన్‌రావు, రూరల్ ఎస్ఐ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చిగిలి గ్రామంలో తాగునీటి సంపు ప్రారంభిస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఆలూరు/ఆస్పరి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. మండలంలోని చిగిలి గ్రామంలో సర్పంచ్ జయమ్మ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. మూడున్నరేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చిగిలి గ్రామంలో రూ.10.45 కోట్ల లబ్ధి చేకూరిందని వివరించారు. అభివృద్ధి చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అంతకుముందు గ్రామంలో రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించిన తాగునీటి సంపును మంత్రి ప్రారంభించారు. అనంతరం తిప్పన తాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణ స్వామి, ఎంపీటీసీ రాధాకృష్ణ, ఎంపీడీఓ రాధ, ఏఓ మునెమ్మ, కేడీసీసీ చైర్మన్ గోవర్ధన్, నాయకులు రామాంజినేయులు, బసవరాజు, పురుషోత్తం రెడ్డి, పెద్దయ్య, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ వైభోగం



మహారథంపై గొడుగు ప్రతిష్టకోసం వెళుతున్న ధర్మకర్తల కుటుంబం, భక్తులు



కలశాలతో పాల్గొన్న మహిళలు



మూలవిరాట్‌కు పుష్ప రథోత్సవ దృశ్యం

స్థానిక నీలకంఠేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుభకృత్ నామ సంవత్సరం పుష్యమాస పౌర్ణమి రోజు శుక్రవారం రాత్రి 11.45 గంటలకు స్వామివారి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. వధువు తరఫున బండా జీవన్న కుటుంబం, వరుడి తరుపున గడిగె శ్రీనివాస బాబు బంధువులుగా వ్యవహరించి వివాహ తంతు పూర్తి చేశారు. – ఎమ్మిగనూరు

పొలం విషయంలో ఘర్షణ

పత్తికొండ రూరల్: హోసూరు సమీపంలో పొలం విషయంలో ఇరువురి మధ్య శుక్రవారం ఘర్షణ చోటుచేసుకుంది. చిన్నహుల్తి రెవెన్యూ సర్వే నంబర్ 150/3లో ఐదెకరాల పొలాన్ని గొల్ల కిష్టన్న నుంచి మల్లేష్, కోటేశ్వరరెడ్డి కొనుగోలు చేశారు. అదే పొలాన్ని గత కొన్నేళ్లగా మాల నారాయణ కుటుంబ సభ్యులు సాగు చేసుకుంటున్నారు. గొల్ల కిష్టన్నకు సంబంధించిన పొలాన్ని మాల నారాయణ కుటుంబీకులు తప్పుడు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని గతంలో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కోటేశ్వరరెడ్డి తెలిపారు. వీరి మధ్య నెలకొన్న వివాదంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్న కోటేశ్వరరెడ్డి, మల్లేష్ కుటుంబ సభ్యులు కోర్టు ఇంజక్షన్ ఆర్డర్ తీసుకుని పొలంలోకి ప్రవేశించారు. వీరిపై మాల నారాయణ కుటుంబ సభ్యులు మధు, మాధవ కృష్ణ దూషణకు దిగడంతో ఘర్షణ చోటుచేసుకుంది. ఇరువర్గాలు పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయడంతో కేసు విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

కృష్ణగిరి: గ్రామాల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్ల నిర్మాణాల వేగం పెంచేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ మోహన్‌కుమార్ ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన హౌసింగ్, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జగనన్న లేఅవుట్లలో, గ్రామాల్లో చేపడుతున్న ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. పనులు పూర్తి చేసిన వాటికి వెంటనే బిల్లుకు సిఫార్సు చేయాలని సూచించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ మనోహర్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయం ముట్టడి

మద్దికెర: స్థానిక సాయినగర్‌లో గత మూడురోజులుగా కొళాయిలకు నీరు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోయారు. నీరు సరఫరా చేసేవరకు కదిలేది లేదని శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట భీష్మించుకొని కూర్చున్నారు. సీనియర్ అసిస్టెంట్ కృష్ణ మాట్లాడుతూ..ఈఓ సెలవులో ఉన్నారని, సంబంధిత వాటర్‌సిబ్బందిని పిలిపించి సమస్యను పరిష్కరిస్తానని చెప్పడంతో వారు వెనుదిరిగారు.

నైపుణ్యం మెరుగుపరుచుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: క్రీడాకారులు నైపుణ్యాన్ని మెరుగుపరుచుకొవచ్చని ఎస్ఐ మస్తాన్‌వలి పేర్కొన్నారు. నీలకంఠేశ్వర స్వామి జాతర మహోత్సవం సందర్భంగా స్థానిక వైడబ్ల్యూసీఎస్ మైదానంలో అంతర్రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ గత నెలరోజులకు పైగా జరుగుతోంది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో డేంజర్ లెవెన్ జట్టుపై ఎఫ్ఎం హాస్పిటల్ జట్టు గెలుపొందింది. ఆ జట్టులో ప్రతిభ చాటిన అబుషేక్ అనే క్రీడాకారుడికి మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్‌తో కలిసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందజేశారు. కౌన్సిలర్లు అమాన్, ఇషాక్ నిర్వాహకులు సయ్యద్‌చాంద్, రంగన్న, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా రంగన్న

పత్తికొండ రూరల్: బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా సీసీ.రంగన్నకు శుక్రవారం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రంగాగౌడు నియామక పత్రాన్ని అందజేశారు. గత కొన్నేళ్లుగా విద్యార్థి, అనుబంధ సంఘాల్లో పనిచేసిన రంగన్నను జిల్లా అధ్యక్షుడు పోలంకి రామస్వామి ఆదేశాల మేరకు నియమించినట్లు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మల్లికార్జున పేర్కొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రాధాన్యం

తుగ్గలి: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని పీఎంసీ చైర్మన్ పురుషోత్తం, సచివాలయ కన్వీనర్ బండ్లపల్లి వెంకటేష్ అన్నారు. శుక్రవారం ముక్కెల్ల యూపీ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న 39 మంది విద్యార్థులకు హెచ్ఎం శోభారాణితో కలిసి ట్యాబ్‌లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వర్లు, చంద్ర పాల్గొన్నారు.

లక్ష్యం చేరుకునేలా పనులు చేపట్టండి



అల్లుగుండు చెక్‌డ్యాం పూడికతీత పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

వెల్దుర్తి: మార్చిలోపు నిర్దేశించిన లక్ష్యం చేరుకునేలా ప్రణాళికతో పనులు చేపట్టాలని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక ఉపాధి కార్యాలయంలో వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల ఏపీఓలు రాజునాయక్, షకూర్, శ్రీనివాసులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రతి గ్రామంలో ప్రతి కూలీకి పని దొరికేలా పనులు చేపట్టి, వలసల నివారణ, పేదల ఆర్థిక స్థితి మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్‌తోపాటు అనుబంధంగా వివిధ శాఖలలో చేపడుతున్న పనులు వేగవంతం చేయాలన్నారు. అంతకు ముందు ఆయన వెల్దుర్తి మండల పరిధిలోని మల్లెపల్లె సమీపాన రూ.2.80 లక్షల నిధులతో చేపడుతున్న డక్‌అవుట్ పాండ్‌ను సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డితో కలిసి పరిశీలించారు. భూగర్భ జలాలు పెరిగేలా, పశువులకు నీరు దొరికేలా, మోడల్ పాండ్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. అల్లుగుండు గ్రామ సమీపాన చేపడుతున్న చెక్‌డ్యాం పూడికతీత పనులు పరిశీలించారు. ప్రతి శుక్రవారం జరిపే రోజ్‌గార్ దివస్‌లో భాగంగా ఆయా పనుల వద్ద కూలీలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానన్నారు. హైవే నుంచి మల్లెపల్లెకు రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వెల్దుర్తి ఏపీఓ, ఈసీ భరత్, టీఏ రామాంజనేయులు, ఎఫ్ఏలు ఉన్నారు.

అలుపెరుగని సంకల్పం

- ప్రత్యేక హోదా డిమాండ్‌తో ఇచ్ఛాపురం నుంచి అనంతపురం వరకు ట్రైసైకిల్ యాత్ర చేపట్టిన దివ్యాంగుడు



యాత్ర వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయం చేరుకున్న సందర్భంగా మాట్లాడుతున్న ప్రసాద్

వెల్దుర్తి: రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖపట్నానికి రైల్వే జోన్ కేటాయించాలన్న డిమాండ్‌తో శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం బూర్గం గ్రామానికి చెందిన దివ్యాంగుడు నెయ్యల ప్రసాద్ సొంత జిల్లా నుంచి అనంతపురం జిల్లా వరకు చేపట్టిన ట్రైసైకిల్ యాత్ర శుక్రవారం వెల్దుర్తి చేరుకుంది. 2018లో ఇచ్ఛాపురంలో ప్రారంభించిన ఇతని యాత్ర 10 జిల్లాలు దాటుకుని 2020లో నంద్యాలలో కరోనా పరిస్థితుల కారణంగా ఆగిపోయింది. తిరిగి గత నెల 19న యాత్ర నంద్యాలలో ఆగిన చోటు నుంచి ప్రారంభించిన ప్రసాద్ డోన్ మీదుగా వెల్దుర్తి చేరుకుని స్థానిక అధికారులకు వినతిపత్రాలు అందించాడు. ఆయన మాట్లాడుతూ పోలియోకు గురైన తాను గ్రామంలో పాన్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపాడు. రాష్ట్రానికి ఏదైనా చేయాలనే తలంపుతో అప్పటి శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ లక్ష్మీనరసింహ సహకారంతో యాత్ర ప్రారంభించినట్లు వివరించాడు. ప్రతిరోజు 12 కి.మీ మేర దాతల సహకారంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పాడు. అన్ని జిల్లాల్లో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు, మండల అధికారులకు తన నివేదన తెలుపుతూ, పలువురి అభిప్రాయాలు తీసుకుంటున్నట్లు తెలిపాడు. దాదాపు 4 వేల కి.మీల తన యాత్ర ముగింపు అనంతరం అనంతపురం నుంచి రైలులో ఢిల్లీ చేరుకుని తన డిమాండ్‌తో పాటు రాష్ట్ర ప్రజల అభీష్టాన్ని కేంద్రానికి నివేదించనున్నట్లు ఎన్.ప్రసాద్ తెలిపాడు.

ప్రతిపక్షాల దుష్ప్రచారానికి పింఛన్లతో చెంపపెట్టు



రామళ్లకోటలో లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి: 'పింఛన్లు తొలగిస్తున్నారంటా? నోటీసులు కూడా ఇచ్చారు' అంటూ పింఛన్ లబ్ధిదారుల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నం చేసిన టీడీపీ, ఊదరగొట్టిన పచ్చ మీడియాకు జగనన్న కొత్త ఏడాది పింఛన్ సొమ్ము పెంచి ఇవ్వడంతోపాటు వేలాది కొత్త పింఛన్లు మంజూరు చేయడం చెంపపెట్టు లాంటిదని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. పింఛను వారోత్సవాల్లో భాగంగా రామళ్లకోట గ్రామంలో 37 మందికి కొత్తగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కరోనా పరిస్థితులతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా ఇచ్చిన మాట మేరకు సీఎం జగనన్న సంక్షేమ పథకాలు అమలు చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలిచాడన్నారు. గత ప్రభుత్వం కంటే 25 లక్షల పింఛన్లను అదనంగా ఇస్తూ విడతల వారీగా పింఛను సొమ్ము పెంచుతున్నారని వివరించారు. పెంచిన పింఛన్ సొమ్ము, నూతన పింఛను లబ్ధిదారుల మోములో సంతోషాలతో ప్రతిగ్రామంలో పండుగ నెలకొందన్నారు. జగనన్నను మరో సారి సీఎంగా దీవించాలని ప్రజలను కోరారు. అనంతరం రామళ్లకోట గ్రామ ఎంట్రన్స్‌లో కొలువైన సుగాలి నాగమ్మ ఆలయ కాంపౌండ్ నిర్మాణానికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ఈఓఆర్డీ నరసింహులు, జెడ్పీటీసీ సుంకన్న, సర్పంచ్ నిర్మల, రామళ్లకోట నాయ కులు మాధవస్వామి, రాధాకృష్ణారెడ్డి, కోఆప్షన్ మెంబర్ మాలిక్‌బాష, బీటీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘాలు ఆర్థికంగా బలపడాలి

వెల్దుర్తి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు ఉన్నతికి అన్ని చర్యలు తీసుకుంటోందని, ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ఉపయోగించుకుని రైతులు ఆర్థికంగా బలపడాలని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సూచించారు. శుక్రవారం ఆమె కర్నూలులోని తన స్వగృహం వద్ద వెల్దుర్తి మండలం గోవర్ధనగిరి-2 ఆర్బీకే పరిధిలోని యువజన శ్రామిక రైతు మిత్ర సంఘానికి ప్రభుత్వం సబ్సిడీతో మంజూరుచేసిన రూ.12 లక్షల విలువగల ట్రాక్టర్, వ్యవసాయ పనిముట్లు అందజేశారు. రైతు సంఘం ప్రతినిధులు శేఖర్, సీతారామయ్య, ఏఓ అక్బర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



కలుగొట్లలో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే

జగనన్న పాలనలో సుఖసంతోషాలు

వెల్దుర్తి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉన్నారని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. శుక్రవారం ఆమె కలుగొట్ల గ్రామం బీసీ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తూ వారి యోగక్షేమాలు అడుగుతూ సాగారు. తమకు ఫలానా సంక్షేమ పథకాలన్నీ అందాయనే లబ్ధిదారుల సమాధానాలతో ఆనందాలు నిండాయి. గ్రామంలోనూ, వ్యక్తిగతంగానూ ప్రజలు తెలిపిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలో ఇంటింటికీ కొళాయి పథకం కింద చేపడుతున్న ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల్లో సుఖసంతోషాలు, ప్రభుత్వం పట్ల ఉన్న ఆదరణ ఓర్వలేని టీడీపీ కుట్రలు, కుతంత్రాలు చేస్తోందని విమర్శించారు. రాజకీయ భవిష్యత్తు లేదని తెలుసుకున్న చంద్రబాబు భయంతో దిక్కుతోచని స్థితిలో బాదుడే బాదుడుతో ఫ్లాప్‌షో నిర్వహించి చేతులు కాల్చుకున్నాడన్నారు. ప్రస్తుతం ఇదేం ఖర్మ అంటూ చేపట్టిన యాత్ర అట్టర్ ఫ్లాప్‌షో అని తెలిసి లబోదిబోమంటున్నాడని ఎద్దేవా చేశారు. కలుగొట్ల జనార్ధన్‌రెడ్డి, రామాంజనేయులు, భరత్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఫొటోగ్రాఫర్లు



ఆర్థికసాయం అందజేస్తున్న ఫొటోగ్రాఫర్లు

కృష్ణగిరి/వెల్దుర్తి: కృష్ణగిరి మండలం పుట్లూరుకు చెందిన ఫొటోగ్రాఫర్ హనుమన్న గతేడాది సెప్టెంబర్ 9న కర్నూలులో రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందాడు. ఇతనిపై ఆధారపడి జీవిస్తున్న భార్య, ముగ్గురు పిల్లలను చూసి చలించిన తోటి మిత్రులు వారికి తోచినంత సాయం చేస్తూ డబ్బు పోగుచేశారు. శుక్రవారం పుట్లూరు గ్రామంలో బాధిత కుటుంబ సభ్యులకు కర్నూలు ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ ప్రతినిధులు బంగారుపేట రాము, చిన్నటేకూరు కళ్యాణ్, మధు, హనీఫ్, వాల్మీకి రాము, రజినీ, శ్రీను, రేమట రఘు తదితరులు రూ.1,27,000 ఆర్థికసాయాన్ని అందజేసి దాతృత్వం చాటుకున్నారు.

సంఘాల పనితీరు మెరుగుపడాలి

కృష్ణగిరి: గ్రామాల్లో పొదుపు సంఘాల పనితీరు మెరుగుపరిచి ప్రతి మహిళా పొదుపు పాటించేలా కృషిచేయాలని ఐకేపీ ఏపీఎం దాసన్న ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన వీఓఏలు,గ్రామైఖ్య సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. పొదుపు పాటించేలా మహిళల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ఆరు నెలలు పూర్తయిన వికలాంగుల గ్రూపులకు బ్యాంకు రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

వెల్దుర్తి: బింగిదొడ్డి గ్రామంలో శుక్రవారం నాయకుడు పోతురెడ్డి విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో కర్నూలు అమీలియో ఆసుపత్రి వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కంటిచూపు, షుగర్, బీపీ, ఈసీజీలతో, 2డీ ఎకో పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. గ్రామాల్లో శిబిరం ఏర్పాటు చేస్తే ఉచితంగా వైద్య సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నామని అమీలియో హాస్పిటల్ క్యాంప్ మేనేజర్ వరప్రసాద్ తెలుపుతూ నిర్వాహకులు తన ఫోన్ నంబర్ 91821 79345కు కాల్ చేయవచ్చన్నారు.

సీహెచ్‌సీలో విజిలెన్స్ తనిఖీ



వెల్దుర్తి సీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారులు

వెల్దుర్తి: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో శుక్రవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ సీఐ శ్రీధర్, ఏఓ గణేశ్ ఆసుపత్రికి చేరుకుని ఓపీ పేషెంట్లకు అందిస్తున్న సేవలు, శుభ్రతను పరిశీలించారు. ఫేస్ రికగ్నైజేషన్ హాజరును తనికీ చేశారు. రికార్డులు, మందుల నిల్వను పరిశీలించారు. ఇన్‌పేషెంట్లతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. సిబ్బందిని విచారించారు. ఆసుపత్రిలో ర్యాబిస్ వ్యాక్సిన్ అందుబాటులో లేకపోవడాన్ని గుర్తించారు. నూతన భవనం సామగ్రి పాత భవనంలో ఉంచడంతో ఇన్‌పేషెంట్లకు కలుగుతున్న అసౌకర్యాలపై అధికారులకు తగు ఆదేశాలిచ్చారు. ఆస్పత్రి కొత్త భవనం త్వరగా పూర్తి చేసి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలంటూ విజిలెన్స్ అధికారులను వైద్యాధికారులు విన్నవించారు. తనిఖీల వివరాలు ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

పెరటి కోళ్ల పెంపకంతో ఆదాయం



మద్దికెరలో పెరటి కోళ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం అందజేసే సబ్సిడీ పథకాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని జెడ్పీటీసీ దేవిరెడ్డి మురళీధర్‌రెడ్డి, ఎంపీపీ డీఎస్ అనితాయాదవ్, వైకేపీ ఏపీఎం సూర్యప్రకాష్ సూచించారు. శుక్రవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో పెరటి కోళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ మండలంలో పొదుపు సంఘాల మహిళలకు 90 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. ఒక్కొక్క యూనిట్‌లో 8 పెట్టలు, 3 పుంజులు ఉంటాయని వాటి విలువ రూ.3,150 ఉంటుందన్నారు. ఈ కోళ్లు దాదాపు 150 గుడ్లు పెడతాయని వాటిని విక్రయించి అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. ఐడీసీ డైరెక్టర్ ఆర్.వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ నరసింహమూర్తి, పంచాయతీ సలహాదారు బండారు ఆంజనేయులు ఎంపీటీసీలు ఆంజనేయులు, రామకృష్ణ, రామకృష్ణారెడ్డి ఉన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

నందవరం: పదిలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంఆర్సీ భవనం ఆవరణలో రాష్ట్రోపాధ్యాయం సంఘం(ఎస్టీయూ)-2023 నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను ఎంఈఓ, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ బసవరాజు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఎస్టీయూ నాయకులు వీరేష్, నరసప్ప, రామకృష్ణారెడ్డి, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు



హాలహర్విలో పింఛను పంపిణీ చేస్తున్న గుమ్మనూరు నారాయణ స్వామి

హాలహర్వి (ఆలూరు రూరల్): అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పాలన సాగించడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే సాధ్యమని ఆలూరు వైఎస్సార్‌సీపీ నాయకుడు నారాయణ స్వామి అన్నారు. హాలహర్వి ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం కొత్తగా మంజూరైన 197 పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక పింఛన్ మొత్తాన్ని విడతల వారీగా పెంచుతున్నారన్నారు. జెడ్పీటీసీ లింగప్ప, వైస్‌ఎంపీపీ నాగేష్, ఎంపీడీఓ ఆంటోని, శ్రీనివాసులు, మండల కన్వీనర్ భీమప్ప చౌదరి తదితరులు ఉన్నారు.

మద్దికెర: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతిఒక్కరికీ పింఛన్లు అందిస్తోందని ఎంపీపీ డీఎస్ అనితాయాదవ్, జెడ్పీటీసీ దేవిరెడ్డి మురళీధర్‌రెడ్డి, ఎంపీడీఓ నరసింహమూర్తి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో 198 మందికి కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, మాజీఎంపీటీసీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మద్దికెరలో పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బెంగళూరుకు వెళ్లి పింఛన్ పంపిణీ

చిప్పగిరి: మండలంలోని రామదుర్గం గ్రామానికి చెందిన వృద్ధురాలు వడ్డె వెంకటలక్ష్మికి ఆరోగ్యం సహకరించకపోవడంతో బెంగళూరులో నివాసం ఉంటున్న కూతురు చెంపమ్మ వద్దకు ఇటీవల వెళ్లింది. విశయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ సుంకన్న శుక్రవారం బెంగళూరుకు వెళ్లి పింఛన్ అందించాడు. తమ కోసం పొరుగు రాష్ట్రానికి వచ్చి పింఛను అందించిన వలెంటీర్ సుంకన్నకు వృద్ధురాలు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మిగనూరుటౌన్: పింఛన్ల పెంపుతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరిస్తోందని పట్టణంలోని 32వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ కోటకొండ నరసింహులు పేర్కొన్నారు. శుక్రవారం వార్డు పరిధిలో కొత్తగా మంజూరైన 19 పింఛన్లను స్థానిక సచివాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు.